# నిస్సహాయులు

## ముదిగంటి సుజాతారెడ్డి

జానమ్మ మొఖం చిన్నబోయి వుంది. దూరంగా ఆకాశంలో వాన చారికలు నల్లగా కన్పిస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఇక్కడా వాన పడొచ్చు. వాన మబ్బు లెక్కనే జానమ్మ మొఖం వుంది. ఈమెకు పెద్దగా ఏడ్వాలని వుంది. కాని ఆగబట్టుకుంటున్నది. పెంకుటింట్లోకి అడుగు పెట్టంగనే కట్టెల పొయ్యి ముందల అత్త కొమిరమ్మ కూర్చొని కన్పించింది. కొమిరమ్మ చూపులు పొయ్యి మీద రాతెండి గిన్నెలో మరుగుతున్న ఎసరు మీదనే వున్నాయి. కోడలు వచ్చిన చప్పుడు విని కొమిరమ్మ చూపులు తిప్పింది. ఆమె కండ్లల్లో శూన్యం గూడు కట్టుకుంది. ఆ శూన్యంలో చెప్పలేనన్ని వేదనలున్నాయి. కోడలి దిక్కు జాలిగా చూసింది కొమిరమ్మ.

"ఏందే గట్లున్నవ్? అయ్యోరు ఏమన్నడు?" అడిగింది. జాన్నమ్మ నిట్టూర్పు విడిచింది.

"శాంతిపెట్టి పూజ యగ్నం చేయాల్నంటున్నడు" ఆమె గొంతు నిస్సహాయంగా వుంది.

"గంతేగద! దాంతోటి అందరి నోల్లు మూతబడ్తయి! మంచిదే!... మల్లెందుకు గట్లున్నవ్?"

"శాంతి పెట్టాల్నంటె మాటలా అత్త! అయ్యోరు చెప్పిన సామాన్లు అయ్యోర్లకిచ్చే దానాలు, దక్షిణలు, కొత్త బట్టలు, ఆవు- దూడ కానికలు... ఊర్లె పెద్దలకు, కులపోల్లకు విందులు- గదంత లెక్క జూస్తె శానపైసలయ్యేటట్లున్నయి. గన్ని పైసలు గిప్పుడు ఎక్కడ్నుంచి దెస్తం! ఒక్క రేగట్ల మునుపటేడు పత్తి యేసి మోసపోతిమి. మల్ల మంది మాటలు బట్టుకొని గీ యేడు సుత పత్తి యేస్తిమి. అప్పుకు మల్లింత అప్పు ఆయె. గీ యేడు పత్తి బాగ పండుతదని ఉగాది పంచాంగంల వున్నదన్రి.

అయ్యోరు ఉగాది మాపు పంచాంగం సదివి తెల్ల పంటలకు డోక లేదని శెప్పె. దాంతోటి గీ యేడు పత్తి యేస్తే మునుపటేటి అప్పు తీర్తది. పత్తే యేద్దామని ఊరోల్లు పాట వాడిరి. కాని యేమైంది! గీ యేడు మల్ల పత్తి పురుగు వట్టి నాశనమాయె! ఎన్ని మందులు గుప్పి నా పురుగులు బలిసిపోయినయె గానీ చావవాయె! రెండేండ్ల నుంచి కోమటాయన దగ్గర ఏలకొద్ది అప్పు జేస్తిమి. తినే కూడు సుత అప్పు పైసల నుంచేనాయె. మీదంగ బ్యాంకులు అప్పులిస్తున్నయంటె గవ్వీ తీసుకుంటిమి. గంత ఘనం లాగోడి పెడ్తే మిగిలింది అప్పులేనాయె! గిప్పుడు గీ కర్సుకు ఎవల తానికి పోదాం అప్పుకని!" జానమ్మ గొంతు బిగుసుకపోయింది. ఏడ్పును కడుపులో దాచుకున్నందుకేమో ఆమె గొంతు పెగుల్తలేదింక. "సరే! ఏం జేస్తం! అప్పో సప్పో జేయాలె! లేకుంటె ఊరోల్లు కులపోల్లు నెగులనిచ్చేటట్లు లేరు. అందరికీ దూరమై బతుకతమెట్ల!" కొమారమ్మ గొంతులో నిస్సహాయత.

జానమ్మ గలుమల్లనే కూలబడిపోయింది. కొమిరి మెల్లగ లేశి మసలుతున్న ఎసట్లో కడిగిపెట్టిన బియ్యం పోసింది.

"పోరలు బువ్వ బువ్వ అని లొల్లి పెడ్తుంటె అన్నం వండుతున్న. బియ్యం గిన్ని అనుసూర్య దగ్గర బదులు అడుక్కొచ్చిన" జానమ్మ అడుగకున్నా చెప్పింది కొమిరమ్మ.


గలుమల్ల కూలబడ్డ జానమ్మ కాడికి పండుకున్నడనుకున్న చంటోడు రెండేండ్లవాడు పాక్కుంట వచ్చి ఆమె చంక కింద చేరి రవికెనెత్తి పైకి నూకేసి చన్నును నోట్లోకి దోపుకొని జుప్ప జుప్ప పాలు చీకటం మొదలుపెట్టాడు. "ఆకలి అవుతుందేమో కొడుక్కు!" జానమ్మ గుండె పగిలింది. కొడుకును రెండు చేతుల్తోటి దగ్గరికి గుంజుకుంది. వాడి పొడుగైన వెంట్రుకలు దుమ్ముపట్టి వున్నాయి. నెత్తికి నూనె లేక పల్లబారి జడలు జడలుగా కట్టినయి. జానమ్మ మునివేళ్ళతో కొడుకు నెత్తిని నిమిరింది. చిక్కువడ్డ వెంట్రుకలను విడదీయటానికి వేళ్ళతో దువ్వింది. తల్లి వేళ్ళ స్పర్శకు తన్మయుడై చంటోడు ఆనందంగా కండ్లు మెరిపిస్తూ పాలు చీకుతున్నాడు. పెద్దది కూతురు ఐదేండ్లది. నాయనమ్మ జొన్న చొప్ప బెండ్లతో చేసిచ్చిన బండితో ఆడుకుంటున్నది. బువ్వ బువ్వ అని ఆఖరికి ఆటలో పడి ఆకలి మాట యాది మరిశిపోయినట్లుంది.

కథ



"అయ్యోరు యేమైన తక్కువల అందరి నోర్లు మూయించే వుపాయం చెప్తడని పోతె గట్ల చెప్పవట్టె! పూజకు, విందులకు, దానాలకు, దక్షిణలకు తక్కువలకు తక్కువ నాలుగు వేలు కర్సు జెప్పె! అవ్వన్ని లేంది శాంతిగాదు అని అనవట్టె! ఏ జన్మల జేసుకున్న పాపమో గదంత ఒదులాలంటె చిన్న ముచ్చటా? నలుగిట్ల అవుననిపించాలంటె ఉత్తగైతద అన్నడు. గక్కడికీ తక్కువల్నె జెప్పిన... మీ కష్టాలు జూసి- అనవట్టే అయ్యోరు. గిన్ని జేసినా కొన్నాళ్ళు ఎవలతో అంటు ముట్టు లేకుంట ఊరి బయట గుడిసెల వుండాలె.. అది తప్పదు అనవట్టె అయ్యోరు. తనలో తానే గొణుక్కుంటున్నట్లుగ అంది జానమ్మ.

"అయ్యోరు సుత ఏం జేస్తడు. మనమెన్నడో జేసుకున్న పాపం గీ లెక్క సుట్టుకుంది. లేకపోతె నా కొడుక్కు గిసొంటి బీమారి ఎందుకొస్తది?" కొమిరమ్మ పైట చెంగుతోటి ముక్కు తుడుచుకుంది.



కొమిరమ్మ భర్త దున్నుకుంట దున్నుకుంట నాగలి పిడి పగ్గాలు చేతిలోంచి విడిచిపెట్టి అక్కడి కక్కడ్నే బురద పొలంలనే పడిపోయి ప్రాణాలు విడిచిపెట్టాడు. అప్పుడు కొడుకు జయరాం రెండేండ్లోడు. ఎట్లనో అట్ల ఊరోల్ల ముందల, పాలోల్ల ముందల, కులపోల ముందల నాదాన్ కాకుంట సంసారం నడిపింది, కొడుకును పెంచి పెద్ద జేసింది కొమిరమ్మ. జయరాం చిన్న వయస్సులనే వ్యవసాయంలకు దిగిండు. వాడు బుద్ధిమంతుడై ఇప్పుడు పెండ్లయి ఇద్దరు పిల్లల తండ్రియిండు. ఎన్నడూ ఒకరి జోలికి సుద్దికి పోయెటోడుకాదు. వాని మానాన వాడుంటడు. వానిలో కుట్ర, కుత్సితం లేనే లేవు. నలుగురికి సాయం చేద్దమన్న యావే గాని చెడు చేస్తననడు. అసొంటోనికి గీ మాయరోగం ఎక్కడ్నుంచి వచ్చి సుట్టుకున్నదో తెల్వకపాయె" కొమిరమ్మ కండ్లనుంచి నీళ్ళు దునికినయి.

"వానికి చిన్నప్పట్నుంచి ఒక సంబురమన్నది ఎరుకలేదు. గింతప్పుడు తండ్రి పోతె భూమిని మింగుదమని చూస్తున్న పాలోల్ల తోటి సెగులుకుంట వచ్చి వానికి భూమిని అప్పజెప్పిన. ఆ భూమిని పొతం జేసుకుంటనె వచ్చిండు. ఒకరి తెరువుకు పోయినోడు కాదు. ఒగరితోటి ఎకసక్కెమాడినోడు కాదు. కాలం వుదార్థం చేసినోడు కాదు. వాడు తెల్ల కల్లు గాని నల్ల కల్లు గాని రుశి మరగలేదు. సుట్ట బీడీ అన్నది వానికి ఎర్కేలేదు. గోపసంటోడు. వానికీ రోగమేంది? దేవునికైన పాపపుణ్యముండాలె...! కొమిరమ్మ నలుగురికి ఎక్కడ వినవస్తదో అని గొంతెత్తకుంటనే శోకం పెట్టి ఏడ్చింది.

"ఊర్కో అత్త. పాణానికేం ముప్పు లేదనే డాక్టరు చెప్పె. మంచోల్లకే దేవుడు కష్టాలు తెచ్చిపెడ్తడు. రెండేండ్లయింది పంట చేతికి రాక అన్నమో అంట అల్లాడుతుంటె బగమంతుడు మీది నుంచి ఈ కష్టం పెట్టె' జానమ్మ అత్తనూరడించిందే గాని ఆమె కండ్లల్ల నుంచి కన్నీళ్ళ ధారలు కద్దున్నాయి.

జయరాం ముఖం కొన్ని నెలల నుంచే నల్లబడ్తున్నది. చెంపలు, ముక్కు మందమై చర్మం ఉబ్బినట్లుగా వుంటున్నది. వానల్లేక ఎండలు మండుతున్నయి. ఏడాది పొడుగునా ఎండాకాలం లెక్కనే వుంది. ముఖం అట్లా ఎండకు కమిలిందేమో అనుకుంది జానమ్మ. అత్తక్కూడా చూపించింది. కొమిరమ్మ కొడుకు ముఖం బాగా చూసి నవ్వింది. "వాని మొకానికేమైందే? వాడు ఎప్పుడైన కర్రెగనె వుంటడు. ఎండ దెబ్బకు తోడెం కమిరినట్లయిండు. నాయినా! కొంచెం నీడపట్టు వుండు" అంది.

**జయరాం పట్నం నుంచి వచ్చినంక తన గ్లాసు, తలె వేరే వుంచమని పట్టుపట్టాడు. 'పిల్లకు తగిలితె' అని భయపడ్డాడు. ఇంటివాళ్ళెవరూ జయరాంకు వచ్చిన రోగం గురించి ఊర్లో ఎవరికీ చెప్పలేదు. కాని ఊరిపెద్దలకు, కులమోళ్ళకు, పాలోళ్ళకు తెల్వనే తెల్సింది. పొద్దున్నే ఊరి పెద్దలు, కులపెద్దలు, పాలి పెద్దలు ఇంటికి వచ్చారు.**

జయరాం గోడకున్న చిన్న అద్దంల ముఖం చూసుకున్నాడు. అతని ముఖం అతనికే ఉబ్బి వికారంగా కన్పించింది.

"థూ పాడుగాను గింతఘనం కమిరిపోయిందేంది నా మొకం" అనుకున్నాడు.

కొన్ని రోజులకు జయరాంకు ముక్కుల్లో గాలి ఆడనట్లనిపించింది. మొస తీసుకునుడు కష్టమనిపించింది. భార్యకు చెప్పాడు.

"నీకు గంతఘనం అనుమానంగుంటె పట్నంపోయి డాక్టరుకు చూపించుకోరాదు" అంది జానమ్మ.

"ఓ నాలుగొందలు పట్టుకొని జయరాం పట్నం పోయాడు. పట్నంల జానమ్మ అక్క కొడుకు శేఖర్ ఆటో నడుపుతున్నాడు. జయరాం అతనింటికే వెళ్ళాడు.

"చిన్నాయినా! సర్కారి దవాఖానాల సరిగ్గ చూడరు. బేకారు తిరుగుడైతది" అని శేఖర్ జయరాంను ప్రైవేటు డాక్టరు దగ్గరికి తీసుకపోయాడు. అన్ని పరీక్షలు చేసి డాక్టరు జయరాంకు కుష్ఠురోగమని చెప్పాడు. ఆ పేరు వినగానే జయరాం వణికిపోయాడు. కాని డాక్టరతనికి ధైర్యం చెప్పాడు. 'ఏం భయం లేదయ్యా! నువ్వు ఏడాదిపాటు మందులు తినాలి. అదే తగ్గుతుంది. కాని మందులు మాత్రం మరవవద్దు. నువ్వు అన్నం మరిచినా ఫర్వాలేదు గాని మందులు మాత్రం మరువకుండా వేసుకోవాలి, తగ్గుతుంది. మందులు సర్కారి దవాఖానాలో ఫ్రీగా ఇస్తారు. నేను చిట్టీ రాసి యిస్తాను, నెల నెల వచ్చి నువ్వు మందులు తీసుకొని పో" అన్నాడు డాక్టరు. అయినా జయరాం దిగులు మానలేదు. "చిన్నాయనా! భయం లేదని డాక్టరు చెప్పిండు గద! ఏడాది ఎంతల తిరిగిపోతది! ఏడాది సక్కంగ మరువకుంట మందులు వాడినవంటె అంతా బాగయితది. ఫికరు పడే అక్కర్లేదు" అని శేఖర్ సంజాయించాడు.

ఇంటికి పోయినంక కుష్ఠురోగమని విని కొమిరమ్మ, జానమ్మలకు దుఃఖం ఆగలేదు. కాని జానమ్మ తన దుఃఖాన్ని దిగమింగి అత్తను "ఊకో అత్తా! పెద్దగ ఏడ్వకు నలుగురికి తెలుస్తంది. మందులు తింటె నయమైతదని డాక్టరన్నడు కదా" అని కొమిరమ్మను ఊరడించింది.

జయరాం పట్నం నుంచి వచ్చినంక తన గ్లాసు, తలె వేరే వుంచమని పట్టుపట్టాడు. 'పిల్లకు తగిలితె' అని భయపడ్డాడు. ఇంటివాళ్ళెవరూ జయరాంకు వచ్చిన రోగం గురించి ఊర్లో ఎవరికీ చెప్పలేదు. కాని ఊరిపెద్దలకు, కులమోళ్ళకు, పాలోళ్ళకు తెల్వనే తెల్సింది. పొద్దున్నే ఊరి పెద్దలు, కులపెద్దలు, పాలి పెద్దలు ఇంటికి వచ్చారు.

"జయరాములూ! నీకు కుష్ఠువ్యాధి సోకిందని మాకెర్కయింది. గిసొంటి పాపపు రోగాన్ని ఏమంట దాచిపెట్టాల్నని అనుకుంటున్నవ్! నువ్వు ఊర్లె వుండొద్దు. ఊరికి మంచిది కాదు. పో! పోయి ఊరిబయట గుడిసేసుకొని వుండాలె!" అని అన్నాడు ఊరి పెద్ద తిర్మల్‌రావు.

"అయినా నాకెర్కలేక అడుగుత!గిసొంటి పాపాన్నిఎట్ల మూసిపెట్టినవ్?

గీ రోగం ఊరోల్లందరికి తాకాల్నని చూసినవ్? నువ్వు మనుషుల నడుమ వుండనేవద్దు. జల్ది ఊరి బయటికి పో!" అన్నాడు కులం పెద్ద పాండురంగం.

జయరాం గుంజకానుకొని నిలబడిపోయిండు. కదుల్తలేడు, మెదుల్త లేడు. కట్టెసరుచుకపోయిండు.

"పాపం జేసుకుంటెనే గిసోంటి రోగమొస్తది. ఇంటి సుట్టుముట్టున్న మాకు గా పాపం సుట్టుకోకముందల్నే గిక్కడ్నుంచి కదులు..." లొల్లి పెట్టిండు పక్కింట్లో వుండే పాలాయన రాజమౌళి.



"తెల్లారి లేస్తె వీని పాపపు మొకం ఎట్ల జూడాలె, ఏ జల్మల జేసుకున్న పాపమో గిట్ల మాకు అంటగడ్తున్నడు జయరాం! తచ్చణమే నువ్వు గిక్కడ్నుంచి యెల్లిపోవాలె" అన్నాడు జయరాం పెత్తండ్రి కొడుకు రాజయ్య.

అందరూ వెళ్ళిపోయింతర్వాత వాన కురిసి వెలిసినట్లయింది. జానమ్మ పిల్లలతో మంచంల కూలబడిపోయింది. కొమిరమ్మ పొయ్యి ముందల చేరింది. జయరాం మెల్లెగా అక్కడ్నుంచి కదిలాడు. తన చెల్క దగ్గరికి పోయి పాడువడిన బాయి పక్కనున్న గడ్డమీద వేపచెట్టు కింద కూర్చున్నాడు. సూర్యుడు అస్తమించలేదింకా. అక్కడక్కడ నల్లని మబ్బులు. జయరాం ఒక్కడే చింతతో కూర్చున్నాడు. అతనికేం తోస్తలేదు. ఎక్కడికి పోవాల్నో తెలుస్తలేదు. తల్లి, భార్యాపిల్లలు, అప్పులు...! తల్చుకుంటే తల తిరిగిపోతున్నది. పరధ్యానంగా వేప పండ్లన్నిటిని ఏరి కుప్ప వేసాడు. తదేకంగా ఆ కుప్పవైపు చూస్తున్నాడు. "గిదేంది ఊరోల్లు నన్ను అంట రానివాన్ని జేస్తుండ్రు. పాపం జేసిన వంటుండ్రు. ఇదంతా పాపంతోటె అయిందా...?" ఆలోచనలత్తో సతమతమవుతున్నాడు జయరాం.

అప్పుడే అటువైపు సైకిల్ మీద ఫాదర్ విజయానందం పోతున్నాడు. ఒక్కడే ఆలోచనలో చింతతో కూర్చున్న జయరాంను చూసాడు. అది చిన్న ఊరు కాబట్టి ఆఊర్లో వున్నవాళ్ళందరూ తెలుసు ఫాదర్‌కు. జయరాం దగ్గరికి వచ్చాడు. సైకిల్‌ను గడ్డకిందనే స్టాండ్ వేసి ఆపి మీదికి వచ్చాడు. ఎదురుగా తెల్లని పొడుగాటి అంగీలో నిల్చున్న ఫాదర్‌ను చూసాడు జయరాం. తెల్లని గడ్డంతో నిర్మలమైన చిరునవ్వుతో నిలబడి వున్న ఫాదర్ జయరాంకు ఎవరో శాంతిదూత వచ్చి నిలబడ్డట్లుగా అనిపించింది. ఫాదర్ వైపు చూసి చిరునవ్వు నవ్వాడు. ఫాదర్ క్రీస్తు గుడిలో వుంటాడు. జయరాంకు తెలుసు.

"ఏం జయరాం! ఎందుకట్లున్నావు?"ప్రశాంతంగా వుంది ఫాదర్ గొంతు.

ఆ నిర్జన ప్రదేశంలో నిశ్శబ్ద వాతావరణంలో ఫాదర్ పలకరింపు ఎంతో ఊరటగా వినిపించింది. జయరాంకు వెంటనే లోలోపల గూడు కట్టుకున్న దుఃఖం ఉప్పొంగుకొని బయటికి వచ్చింది. ఎక్కి ఎక్కి ఏడ్చాడు.

ఇంట్ల నుండి జయరాం వెళ్ళిపోంగనే జానమ్మ పెద్దగా ఏడ్వటం మొదలుపెట్టింది. కొమిరమ్మ కోడలు దగ్గరికి వచ్చింది. "ఏడ్వకే పోరి! ఎందుకేడుస్తవు? గట్ల అయ్యోరి కాడికి పో! అయ్యోరైతే గీ దీనికేదైన వుపాయం జెప్తడు. గప్పుడు గీ పెద్ద మనుసుల నోరు మూయిస్తడు. పో! అయ్యోరితానికి పోవే పిల్లా!" అని తొందరపెట్టింది కొమిరమ్మ.

"నేనేం పాపం చేసాను ఫాదర్?" అన్నాడు.

ఫాదర్ జయరాం పక్కనే కూర్చున్నాడు. భుజం చుట్టూ చేయి వేసాడు.

"నన్ను ముట్టుకోకుండ్రి..." జరిగాడు జయరాం.

"ఏమైంది చెప్పు?" మళ్ళా ప్రశాంతత.

జయరాం చెప్పాడు. ఊరి వాళ్ళ నిషేధాలు విన్పించాడు. అంతా విని ఫాదర్ నిట్టూర్చాడు.

"జయరాం! నీకొచ్చిన వ్యాధి ఏపూర్వజన్మ పాపం కాదు. అన్ని రోగాలవంటిదే ఆ రోగం. పూర్వకాలంలో ఈ రోగాన్ని గురించి తెలియక మందులు లేక ఏమేమో అనుకునేవాళ్ళు. కాని ఇప్పుడు మందులు వచ్చాయి. నయమైపోతుంది. భయం లేదు" అన్నాడు ఫాదర్. జయరాం భుజం చుట్టూ వున్న తన చేతిని తీయలేదు. భుజం మీద వున్న ఫాదర్ చేయి జయరాంకు ఎంతో ఊరట కలిగిస్తున్నది.

"గుడికి పోతె అయ్యోరు ఎప్పుడైన తననిట్ల దగ్గరికి తీసుకొని ఊరడించిండా? గింత సల్లగ మాట్లాడిండా? మంగళారతి ముందల పెడ్తె, పైసలేసి దేవునికి మొక్కుకొని వచ్చేది గంతే!" గుడికి పొయ్యేదెందుకు పైసలేసుడు కోసమేన? మంగళారతిల పైసలు, హుండిల పైసలు. అంతే పైసలతోటి దేవున్ని కొన్నట్లుంటది. ఇంక పూజలనీ, దేవునికి పెండ్లిళ్ళని అన్ని పైసల్తోటే పని! లైన్ గట్టాలె.... లొల్లి... లొల్లి..."

ఫాదర్ ప్రశాంతమైన మాటలు జయరాంకు ఊరట కలిగించాయి.

"నాయినా! రేపు చర్చికి రా! అక్కడ నీకు శాంతి దొరుకుతుంది. ఏసు క్రీస్తును ప్రార్థిస్తే అన్ని దోషాలు పోతాయి. పాపం ప్రక్షాళనమౌతుంది. రేపు ఆదివారం రా!" అన్నాడు ఫాదర్. అతని గొంతులో ఏదో మైమరపించే ఆకర్షణ.

"చర్చికా...?" తెల్లబోయాడు జయరాం.

ఫాదర్ అది గమనించకుండానే వెళ్ళిపోయాడు. జయరాం మెల్లెగా లేచి ఇంటివైపు నడిచాడు.

** ** **

ఇంట్ల నుండి జయరాం వెళ్ళిపోంగనే జానమ్మ పెద్దగా ఏడ్వటం మొదలుపెట్టింది. కొమిరమ్మ కోడలు దగ్గరికి వచ్చింది. "ఏడ్వకే పోరి! ఎందుకేడుస్తవు? గట్ల అయ్యోరి కాడికి పో! అయ్యోరైతే గీ దీనికేదైన వుపాయం జెప్తడు. గప్పుడు గీ పెద్ద మనుసుల నోరు మూయిస్తడు. పో! అయ్యోరితానికి పోవే పిల్లా!" అని తొందర పెట్టింది కొమిరమ్మ.

"పొమ్మంటె పోవేందే రాయిలెక్క కూసుకున్నవు?" కోప్పడింది కొమిరమ్మ. ఇక విధిలేక పిల్లల్ని అత్త దగ్గరుంచి, జానమ్మ అయ్యోరింటికి పోయింది. వచ్చిన కష్టం చెప్పింది.

అయ్యోరు కృష్ణమూర్తి అప్పుడే గుడిలో పూజ చేసి ఇంటికి వచ్చినట్టున్నాడు. పసుపు పచ్చని కండువా మీద రామనామం అద్ది వుంది. ఆయన ముఖం మీద ఎర్రని బొట్టు; దానికింద గంధం బొట్టు మెరుస్తున్నాయి. అయ్యోరి ముఖం నిగనిగలాడుతూ చిరునవ్వుతో వెలుగుతూ వుంది. జానమ్మ కష్టం విని అతని మెదడు ఆలోచనల్లోకి పోయింది కాస్సేపు. వెంటనే తేరుకొని "శాంతి పూజ చెయ్యాలె జానమ్మ! దానికి మరి ఖర్చు అవుతుంది" నువ్వు భరిస్తావా? అన్నట్లుగా వుంది అతని గొంతు.

"చెప్పుండ్రి సామి! ఎంత ఖర్చయితదో..." భయపడుతూ వుంది జానమ్మ.

"ఊc...ఊc...ఐదువేల దాకా వస్తుంది ఖర్చు మరి. యఙ్ఞం జరిపించాలె. మామూలు పూజలు కాదు. దోషం పోవాలంటె పూజతోపాటు యఙ్ఞం కావాల్సిందే" అన్నాడు కృష్ణమూర్తి కప్పు వైపు చూస్తూ లెక్కలు వేస్తూ.

"అయ్యా సామి! గీ పూజ యగ్నం ఎట్లయిన జరిపించుండ్రి. కాని గన్ని పైసలు?! కొంచెం దయ సూడుండ్రి సామి! ఏమైన తక్కువైతదేమో!?"ప్రాధేయపడింది జానమ్మ.

"సరే!యగ్నంలకు కట్టెలు, నెయ్యి, పాలు, పెరుగు మీరు తెచ్చుకోండ్రి. కొంచెం ఖర్చు కలిసివస్తుంది. నలుగురు అయ్యోర్లుండాలె. తప్పదు. వాళ్ళకు దక్షిణలు, దానాలు అంతా ఓ నాలుగువేలకు వస్తుంది, ఖర్చు" అన్నాడు కృష్ణమూర్తి ఇంక దిగేది లేనట్లుగా.

జానమ్మ మౌనంగా ఆ పైసలెట్ల తేవాల్నని ఆలోచనలో పడ్డది.

"ఇది మహా పాపదోషం జానమ్మ! జన్మజన్మల పాపదోషం. అదంతా పోవాలంటె మాటలా?"

"సామి! సరే... శరపోయి అయిన గీ పూజ జరిపించాలె. ఊరోల్లు బతుకనిచ్చేటట్ల లేరు. సామీ! పూజకు ఏమేం సామాన్లు తేవాల్నో చెప్పుండ్రి. మంచి రోజు చూడండ్రి"అంది జానమ్మ శాంతి పూజ చేయక తప్పదనే నిస్సహాయత ఆమె గొంతులో ధ్వనించింది.

అయ్యోరు రాసిచ్చిన సామాన్ల లిస్టు కాగితం రైకల దోపుకుంది జానమ్మ. తోవలంతా పైసలెక్కడ తేవాల్ననే ఫికరుతోనే వుంది. రెండు మూడు వానచిన్కులు జానమ్మ మీద పడ్డయి. ఇవెక్కడి చిన్కులబ్బా అని జానమ్మ ముఖం ఎత్తి ఆకాశంవైపు చూసింది. నల్లగ మబ్బులు కమ్మివున్నాయి. "వానొస్తద యేంది? ఇప్పుడు వానొచ్చినా అది చెడగొట్టు

వానే! పొట్టకొచ్చిన వరిచేన్లు నాశనమైతయి" జానమ్మ అనుకొని మరింత ఫికరుతో దబదబ నడిచి ఇల్లు చేరుకుంది. జానమ్మ, కొమిరమ్మలు అయ్యోరు చెప్పిన పూజల గురించి మాట్లాడుకొని ఏడుస్తున్న సమయంలోనే జయరాం ఇంటికి తిరిగి వచ్చాడు. ఏం మాట్లాడలేదు.

"నాయినా! రా అన్నం తిందువుగాని" పిల్చింది కొమిరమ్మ మాటాడకుంటా పోయి జయరాం అన్నం తిన్నాడు. అప్పుడే జానమ్మ పిల్లలకూ అన్నం పెట్టి పడుకోబెట్టింది. తరవాత అత్తాకోడళ్ళు అన్నం తిన్నారు. పడుకున్నారు. బాగా రాత్రయింది. ఆలోచనలతో, ఫికరుతో ఎవరికీ నిద్ర రాలేదు చాలాసేపటివరకు. జానమ్మ ఆలోచనలతోనే నిద్రలోకి జారుకుంది.

ఇంతలో ఇంటి కప్పుమీద లుక్కలుక్కమని పెంకులు విరిగిన చప్పుడైంది. జానమ్మకు మెలకువ వచ్చింది. రాళ్ళ వాన కురుస్తుందా ఏంది? అనుకుంది. కాని మబ్బులు ఎప్పుడో విచ్చుకపోయినయి. వానెక్కడిది...? కాదు...కాదు... ఎవరో రాళ్ళు రువ్వుతున్నట్టున్నారు. అత్తా! అని పిల్చింది. మెల్కతోటె వున్న... ఎవరో రాళ్ళేస్తున్నరు" అంది కొమిరమ్మ.

"ఎవలిట్ల రాళ్ళేస్తున్నరు? అన్నాడు జయరాం మంచంల లేచి కూర్చుని. మళ్ళా మళ్ళా ధడ్ ధడ్ మని రాళ్ళు....! ఈసారి పెద్ద రాళ్ళే పడ్తున్నాయి.

"ఎవలల్లా?" అరుస్తూ జయరాం బయటి తలుపు తీద్దామని వాకిట్లోకి నడిచాడు. ఇంతలో ఎవరో ధన్ ధన్‌మని తలుపులమీద పిడికిళ్ళతో కొట్టారు. భయంతో జానమ్మ పిల్లల్ని దగ్గరికి గుంజుకొని కావలించుకుంది. కొమిరమ్మ దడుసుకొని జానమ్మ దగ్గరగా వచ్చి మంచంల కూర్చుంది ముడుచుకపోయి.

వాకిట్లోకి నడిచిన జయరాం ఇది ఊర్లోల్ల పనే అని తెలుసుకొని పందిరి గుంజ దగ్గర్నే నిలబడిపోయాడు. కాస్సేపటికి నిశ్శబ్దం ఆవరించింది. ఇంట్లో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జయరాం నిశ్శబ్దాన్ని చీలుస్తూ... "అమ్మా! ఇయ్యాల బాయికాడ ఫాదర్ కలిసిండు. ఆదివారం చర్చికి రాంద్రి, క్రీస్తును ప్రార్థిస్తే అన్ని పాపదోషాలు పోతయన్నడే" అన్నాడు. కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు.

"నాకూ సూడబోతె గా మతంను నమ్ముకున్నది మంచిదనిపిస్తుంది" అంది కొమిరమ్మ.

"అవునత్త! అయ్యోరు నాలుగైదు వేలు కర్సు అయితదంటుండు. మల్లి కొన్ని రోజులైన నీ కొడుకు ఊరవతల గుడిసేసుకొని వుండక తప్పదంటున్నడు. ఇదెక్కడి గోస? పూజలంటె పైసలతోటి మామ్లా!" గిప్పుడు గీ కరువు కాలంల అంత అప్పు ఎక్కడ దెస్తం? శాంతిపూజ చెయ్యకపోతె ఊర్లోల్లు ఊకుండెటట్లు లేరు. గిట్లనే ఎంతఘనం సతాయిస్తరో? గా క్రీస్తును నమ్ముకున్నది నాకు సుత నయమనిపిస్తున్నది. గీ కర్సు తప్పుతది. గీ ఊరోల్ల నోళ్ళు మూతపడ్తయి" అంది జానమ్మ. ఆమె గొంతులో ఇది తప్ప వేరే ఉపాయం లేదన్న నిస్సహాయం కన్పించింది. "నాకదే అనిపిస్తుంది. క్రీస్తును నమ్ముకుంటె, ప్రార్థన జేస్తె పాపదోషాలన్ని పోతయన్నడు ఫాదర్" అన్నాడు జయరాం. అతని గొంతులోనూ నిస్సహాయత.

ఆ ఆదివారం జయరాం కుటుంబంతో చర్చికి వెళ్ళాడు. ఫాదర్ వాళ్ళని దగ్గరిగా పిల్చి కూర్చుండపెట్టాడు. "మేం ఈరోజు మీకోసం, మీ శాంతి కోసం ప్రార్థనలు చేస్తాం" అన్నాడు ఫాదర్. జయరాం వ్యాధి గురించి చానసేపు మాట్లాడాడు. అది ఎటువంటి రోగమో, ఎట్లా నయమవుతుందో వివరించి అందరికీ చెప్పాడు. అందరికీ అర్థమయ్యేటట్లుగా చెప్తుంటే జయరాంకు మంచిగనిపించింది. తనకే రోగం లేనట్లుగా అనిపించిందతనికి. మందులేసుకుంటె రోగమదే పోతుంది. ఇందుల పాపం, దోషం ఏం లేదు అన్న భావాలు జయరాంలో కలిగాయి ఫాదర్ మాటలు విన్నంక.

జయరాం కిరస్తానీ మతంలో కలిసాడన్న వార్త సోమవారంనాడే ఊరంతా పాకింది. ఎవరూ అతని దగ్గరికి రాలేదు, కలువలేదు. కాని దూరం దూరంగానే వాళ్ళవైపు వంకర చూపులు చూసారు. ఎవరూ ఏమీ అనలేదు. అట్లా నెలరోజులైంది. రెండు నెలలైంది. జయరాం ప్రతి ఆదివారం తల్లి, భార్యా పిల్లలతో చర్చికి పోయి వస్తున్నాడు. ఎవరూ ఏమీ అనటం లేదు, మాట్లాడటం లేదు. జయరాం రోగం గురించి ఏమీ అభ్యంతరాలు వినబడటం లేదు. ప్రశాంత వాతావరణం! కాని జయరాంకే ఇదంతా ఏదో తుఫానుకు ముందుండే ప్రశాంతతలాగా అనిపిస్తుంది. ఏదో అశాంతి మనస్సులో పుడ్తున్నది.

ఒకరోజు అర్ధరాత్రి ఊర్లో పెద్ద అలజడి విన్పించింది. పడమటి దిక్కుగా మంటలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. జయరాం అలజడితో మంచంల లేచి కూర్చున్నాడు. పడమటి దిక్కున ఎర్రటి, పచ్చటి వెలుగులు ఆకాశంలోకి లేచి కన్పించాయి. ఇదేమిటి మంటలా? ఎక్కడివి? ఆందోళనతో బయటికి, వీధిలోకి నడిచాడు జయరాం. అతని వెనుకనే తల్లి, భార్యాపిల్లలు!

"అదేమిటి పడమటి దిక్కున మంటలు! అక్కడ్నే గద చర్చి వుంది! ఆ చర్చి పక్కనే గద ఫాదర్ వుండే ఇల్లు వుంది. చర్చికీ, ఇంటికీ నిప్పు అంటుకుంది. కాలిపోతున్నాయి. కాదు... కాదు... ఎవరో చర్చికి, ఇంటికి నిప్పు వెట్టారు, కాలవెట్టారు. కావలనే నిప్పంటించారు. ఫాదర్ చచ్చిపోయాడా? అతని కుటుంబం, ఫాదర్‌ను చంపటానికే నిప్పు పెట్టారా? అంతే...అంతే...! ఫాదర్‌ను చంపేసారు కసితో".

జయరాంకు దుఃఖమొచ్చింది. వీధిలోనే కూలబడిపోయాడు. పెద్దగా ఏడ్చాడు! తల్లి, భార్యాపిల్లలు అతన్ని చుట్టుముట్టారు. జయరాం పెద్దగా విలపిస్తున్నాడు. అతని దుఃఖానికి అంతమే లేదనిపించింది జానమ్మకు. ఆమె కూడా రోదించింది నిస్సహాయంగా. పిల్లలు వాళ్ళను చూసి ఒకటే ఏడ్పు. కొమిరమ్మ అందర్ని చేతులతో చుట్టేసి తనూ నిస్సహాయంగా ఏడ్చింది. ఆ ఏడ్పులు తప్ప అంతటా నిశ్శబ్దం! స్మశాన వాతావరణం!

## కన్నయ్యకు

పెళ్ళి ఫలితం అయిదోతనం
ప్రేమ ఫలితం అమృతమయం
పెళ్ళి అందరికీ వుండే అవసరం
ప్రేమ ఏ కొందరికో దొరికే వరం.

* * *

నీ విలువెంతో అనుకుంటున్నారంతా
ఎంతో కాదు నా నవ్వంత
నా జడలో నీవు పెట్టిన పువ్వంత

* * *

మనం ఎప్పటికీ కలుసుకోలేం
ఒకరి కోసం ఒకరం తగ్గం
నీకు అహంకారమెక్కువ
నాకు అభిమానమెక్కువ

* * *

మరో జన్మ కావాలి
అపుడూ నేను రాధనే కావాలి
నీవు నన్ను ప్రేమించాలి
నేను నిన్ను పూజించాలి

* * *

నిన్ను చూస్తూ ఎన్నేళ్ళయినా గడపొచ్చు
నీ మాటలు వింటూ నన్ను నేను
మరవొచ్చు
నీ దాననయ్యేందుకై ప్రాణాలను
సైతం త్యాగం చేయొచ్చు
నీ దాననైన తర్వాత మరణమొచ్చినా
నవ్వుకోవచ్చు

* * *

ఇటు నేను, అటు నీవు
ఎటు చూసినా నీవు నేనే
ఎంత ఎడబాసినా అంతటా మనమే

* * *

నీ ప్రేమ దివ్యౌషధం
మరణించేవాళ్ళను కూడ బతికిస్తుంది
నీ వియోగం వజ్రాయుధం
ఎంతటి వారినైనా చచ్చేలా చేస్తుంది

* * *

ఒక్కమారు నిన్ను చూడాలని ఉంది
నీ కళ్ళల్లో నన్ను చూసుకోవాలని ఉంది
మరొక్కమారు నీ పాదాలంటాలని ఉంది
ఆ పాదాల చెంతనే రాలిపోవాలనిఉంది

\- పార్వతి సురపాల


**తెల్లమచ్చలు**

కొత్తగా కనుగొనబడిన ఈ మందు ఉపయోగిస్తే మీ చర్మ రంగు ఖచ్చితంగా 20 గంటల్లోగా మారడానికి హామీ ఇవ్వబడుతోంది. మీ వ్యాధి వివరాలు పంపండి లేదా చీఫ్ వైద్యాజీని ఫోన్‌లో సంప్రదించండి.

Pt. Vijay Kumar Vaidya (910)
P.O: Katri Sarai (Gaya)
Ph: 06112-289346(M) 09431025482